దంచికొట్టిన వాన

● నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

● ప్రధాన రహదారులు, పలు బస్తీల్లో నిలిచిన నీరు

కంటోన్మెంట్/బొల్లారం/మారేడ్‌పల్లి, మే 16: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో కంటోన్మెంట్ పరిధిలోని బోయిన్‌పల్లి, తిరుమలగిరి, కార్ఖానా, బాలంరాయి, కరసూల్‌పురా, బొల్లారం, మారేడ్‌పల్లి, పికెట్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో ఈ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

● బోయిన్‌పల్లి పరిధిలోని సీతారాంపురం, బాపూజీనగర్ ప్రాంతాలతో పాటు మడ్‌ఫోర్డ్ ధోబీఘాట్, సిఖ్ విలేజ్ మస్తాన్ హోటల్ నుంచి డైమండ్ పాయింట్ చౌరస్తాకు వెళ్లే రహదారి పూర్తిగా నీటితో మునిగిపోయింది. ఈ క్రమంలో రామన్న కుంట చెరువుకు భారీగా వరద నీరు చేరుకుంది.

● హర్షవర్ధన్ కాలనీ, మర్రి రాంరెడ్డి కాలనీలో వరద పోటెత్తింది. దీంతో పాటు కార్ఖానా పోలీస్ స్టేషన్ మెయిన్ రోడ్డులో ఇరువైపులా భారీగా నీరు నిలిచి పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

● సాయంత్ర సమయంలో కార్యాలయాలు ముగించుకొని ఇంటికి వెళ్లే ఉద్యోగులకు అటు ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి.

● మరోవైపు పికెట్ గార్డెన్ పూర్తిగా నీటితో నిండిపోగా మారేడ్‌పల్లిలోని పలు బస్తీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ ప్రాంతంలో రోడ్లన్నీ జలాశయాలుగా మారడంతో ఏ ప్రాంతంలో మ్యాన్ హోల్ ఎక్కడ ఉన్నదో అన్న భయంతో బిక్కుబిక్కుమంటూ ద్విచక్ర వాహనదారులు ఆందోళన చెందారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా కంటోన్మెంట్ అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరారు.

సిఖ్ విలేజ్ మస్తాన్ హోటల్ వద్ద ప్రధాన రహదారిపై భారీగా నిలిచిన వరద నీరు

తిరుమలగిరి ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ మధుబాబు

బోయిన్‌పల్లి హర్షవర్ధన్ కాలనీ ప్రధాన దారిపై మ్యాన్ హోల్స్‌ను సరిచేస్తున్న బోర్డు సిబ్బంది

భారీ వర్షం కారణంగా జలమయమైన పికెట్ గార్డెన్

సిఖ్ విలేజ్ మస్తాన్ హోటల్ వద్ద నిలిచిన వరద నీటిలో సైకిళ్లు తొక్కుతూ సరదాగా..

బాలంరాయి బస్‌స్టాప్ వద్ద ప్రయాణికుల అవస్థలు

తాడ్‌బండ్ వద్ద ..

తీన్మార్ మల్లన్నను
ఓడించడం ఖాయం

ఉస్మానియా యూనివర్సిటీ, మే 16: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నగా పిలవబడే చింతపండు నవీన్‌కుమార్‌ను ఓడించడం ఖాయమని ఓయూ జేఏసీ నాయకుడు, తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రశ్నించే గొంతుకనంటూ ఊక దంపుడు వార్తలు చదివిన మల్లన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే నోరెందుకు మూగబోయిందని ప్రశ్నించారు. జర్నలిజం ముసుగులో బహుజనవాది, నిరుద్యోగ పక్షపాతిగా తనకు తాను చెప్పుకునే మల్ల న్న ఏనాడూ విద్యార్థి, నిరుద్యోగుల పక్షాన కొట్లాడలేదన్నారు. జీవో నంబర్ 46 బాధితులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంటే ప్రశ్నించే గొం తుక ఎందుకు మూగబోయిందో స మాధానం చెప్పాలన్నారు.

రేపు గీతాంజలి కళాశాలలో..
జీ-శాట్ పరీక్షలు

మారేడ్‌పల్లి, మే 16:విద్యార్థులకు తమ వంతు సహాయ, సహకారాలను అందించడానికి వెస్ట్ మారేడ్‌పల్లి గీతాంజలి బాలికల జూనియర్ కళాశాల యాజమాన్యం జీ-శాట్ నిర్వహిస్తుందని గీతాంజలి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ వేదకుమారి గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు నుంచి కళాశాలలో జరుగనున్న జీ-శాట్ పరీక్షను రాసి అనుభవజ్ఞులైన అధ్యాపకుల సహకారంతో అనువైన కోర్సులను ఎంపిక చేసుకోవడంతో పాటు, విద్యా సంస్థ అందిస్తున్న ఉపకార వేతనానికి అర్హత సాధించవచ్చునని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో చేరబోయే విద్యార్థులందరూ 86889 48486, 8309685646 నంబర్లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సుల్తాన్‌బజార్ : డెంగ్యూ జ్వరం నూటికి తొంభై తొమ్మిది శాతం మందికి తగ్గి పోతుందని కింగ్ కోఠి ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ పద్మజ పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కోఠి ఆర్ఎఫ్‌పీటీసీ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రతిజ్ఞ కార్యక్రమానికి విచ్చేసి పైవిధంగా పేర్కొన్నారు.

మెజార్టీతో గెలవాలి

సికింద్రాబాద్ ఎంపీగా పద్మారావు గౌడ్ భారీ మెజార్టీతో గెలుపొందాలని కోరుతూ అడ్డగుట్ట బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు గీత దయాకర్ ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు కొమురవెల్లి మల్లన్నస్వామి, కొండ పోచమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సికింద్రాబాద్ లోని ఆయన నివాసానికి చేరుకొని స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.
– అడ్డగుట్ట, మే 16 :

సామాజిక న్యాయం పాటించాలి

తుంగ బాలు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 16: రాష్ట్రంలో ఖాళీ అయిన అన్ని విశ్వవిద్యాలయాలకు వీసీ నియామకాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు హర్షం వ్యక్తం చేశారు. ఈ నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలని డిమాండ్ చేశారు. గతంలో ఎమ్మెల్యే, ఎంపీ, నామినేటెడ్ పదవుల విషయంలో ఎక్కడా కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం పాటించలేదని ఆరోపించారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వీసీ నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలని కోరారు. రాష్ట్రంలోని దాదాపు 90 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలు చదువుకునే విశ్వవిద్యాలాలను మళ్లీ దేశ్ ముఖ్ యూనివర్సిటీలుగా మార్చవద్దని హితవు పలికారు. వీసీల నియామకాల్లో సామాజిక న్యాయం పాటించని పక్షంలో సామాజిక తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో యూనివర్సిటీల బలోపేతానికి నిధులు మంజూరు చేయాలని, వర్సిటీలలో నెలకొని ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా..
స్థానిక ఎన్నికలు నిర్వహించొద్దు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 16: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దానిని అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చూస్తే తెలంగాణ రాష్ట్రంలో మరొక ఉద్యమాన్ని ఆరంభిస్తామని హెచ్చరించారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పేర్కొందని గుర్తు చేశారు. దాని ప్రకారం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీల ఓట్లతోనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో మంత్రివర్గం, నామినేటెడ్ పదవుల్లో రెడ్లకు పెద్దపీట వేశారని ఆరోపించారు. ఇప్పటికైనా మంత్రివర్గం, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు జనా భా దామాషా ప్రకారం పదవులు కట్టబెట్టాలని డిమాండ్ చేశారు.

సమర్ధవంతంగా విధులు..రివార్డులు అందజేత

సిబ్బందికి రివార్డును అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి

అమీర్‌పేట్, మే 16 : సైబరాబాద్ పోలీస్ కమిషనర్ మార్గదర్శకంలో సనత్‌నగర్ పోలీసులు ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వహించారని ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో సనత్‌నగర్ పోలీసులు తమకు కేటాయించిన చెకింగ్ పాయింట్లలో చురుగ్గా వ్యవహరిస్తూ రూ. 22.82 లక్షల అక్రమ నగదును స్వాధీనం చేసుకోవడం విశేషమన్నారు. సనత్‌నగర్ పోలీసుల కృషిని ప్రశంసిస్తూ ఉన్నతాధికారులు ప్రతిభ చాటిన సిబ్బందికి ప్రకటించిన నగదు రివార్డులను గురువారం సనత్‌నగర్ పీఎస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ అందజేశారు. చెకింగ్ పాయింట్‌లో విధులు నిర్వహిస్తూ రూ. 17 లక్షల అక్రమ నగదును పట్టుకున్న సనత్‌నగర్ ఏఎస్ఐ నాగరాజుకు రూ. 5వేల రివార్డును అందజేశారు.

దీంతో పాటు ఇతర చెకింగ్ పాయింట్లలో నగదును పట్టుకోవడంలో విశేషంగా కృషి చేసిన పీఎస్ రైటర్ సతీష్‌కుమార్, ఎఎస్ఐ ముజాఫర్, పీసీ శేఖర్‌లు ఇన్‌స్పెక్టర్ చేతుల మీదుగా రివార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఐ నాగిరెడ్డితో పాటు ఏఎస్ఐలు కృష్ణాగౌడ్, అబ్దుల్ ఫయూమ్, హరీష్, సుశీల రాధాకృష్ణ, అరుణ్‌కుమార్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వారిని వీసీలుగా నియమించవద్దు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 16: యూనివర్సిటీలలో అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన వారిని వైస్ చాన్స్‌లర్లుగా నియమించకూడదని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. బోధన, పరిపాలనా అనుభవం ఉన్నవారినే వీసీలుగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, అంబేద్కర్, జేఎన్టీయూ యూనివర్సిటీలలో కొంతమంది ప్రొఫెసర్లు అర్హత లేకపోయినా అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందారని వివరించారు. అటువంటి వారిని రాష్ట్రంలో ఏ యూనివర్సిటీకి వీసీలను నియమించడంలో పరిగణనలోకి తీసుకోకూడదని విజ్ఞప్తి చేశారు. వీసీ పదవీ కాలం ముగియకముందే నోటిఫికేషన్ జారీ చేసి, సెర్చ్ కమిటీలు ఏర్పాటు చేసి, వీసీ నియామక ప్రక్రియను చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు లెనిన్, భగత్, శేఖర్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

మాణికేశ్వరినగర్‌లో ఈదమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ఠ ఉత్సవానికి డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా దంపతులు హాజరై ప్రత్యేక పూజలు జరిపించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి
డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 16: నగరంలో పలు చోట కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు, మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి ఆదేశించారు. వర్షం కారణంగా పలుచోట్ల రోడ్లపై నిలిచిపోయిన నీటిని డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగిస్తున్నారని చెప్పారు. రోడ్లపై నిలిచిన నీటితో పాటు విరిగిన చెట్ల కొమ్ములను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. జీహెచ్ఎంసీ కంట్రోల్ రూంకు వచ్చే ఫిర్యాదులను క్షేత్రస్థాయి సిబ్బందికి వెంటనే తెలిపి, వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సికింద్రాబాద్ ఆర్య వైశ్యక్లబ్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

సికింద్రాబాద్, మే 16 : సికింద్రాబాద్ ఆర్య వైశ్య క్లబ్ అధ్యక్షుడిగా ప్రొద్దుటూరి వెంకటేశ్వరరావు (బాబు) నియమితులయ్యారు. ఈమేరకు సీతాఫల్‌మండి నామాలగుండుకు చెందిన ప్రొద్దుటూరి వెంకటేశ్వరరావు వివిధ హోదాల్లో ఉన్నప్పుడు పలు సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆర్య వైశ్య కులస్తుల సంక్షేమానికి పాటుపడతానని,తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

అక్రమ షెడ్డును కూలగొడుతున్న జీహెచ్ఎంసీ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 16: తార్నాక డివిజన్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలకు జీహెచ్ఎంసీ అధికారులు నడుం బిగించారు. డివిజన్‌లోని లాలాపేటలో నిబంధనలకు విరుద్ధంగా షెడ్డు నిర్మించారు. దీనిపై వివిధ పత్రికలలో కథనాలు ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు ఆ షెడ్డును కూల్చేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ రజిత మాట్లాడుతూ.. షెడ్డు నిర్మాణంపై తమకు ఫిర్యాదు అందిందని చెప్పారు. జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు షెడ్డును కూల్చేశామని తెలిపారు. ఎవరైనా భవన నిర్మాణాలు చేపడితే నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకోవాలని సూచించారు.

టీఎస్ సెట్ రిజిస్ట్రేషన్
ఫీజులు తగ్గించాలి

ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 16: ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ స్టేట్ లెవల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) రిజిస్ట్రేషన్ ఫీజులను తగ్గించాలని బీఆర్ఎస్వీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డికి బీఆర్ఎస్వీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సెట్ అర్హత పరీక్షకు హాజరు కాబోయే విద్యార్థుల నుంచి అధిక ఫీజులు చేయడం అన్యాయమన్నారు. జనరల్ కేటగిరీకి రూ.2 వేలు, బీసీలకు రూ.1500, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌లకు రూ.1000 ఫీజు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఎటువంటి ఫెలోషిప్‌లు ఇవ్వకుండా, విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేయాలని భావించడం భావ్యం కాదన్నారు. ఆ ఫీజులు చెల్లించలేక విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని వాపోయారు. ప్రభుత్వ యూనివర్సిటీలలో సామాన్య, మధ్య తరగతి, నిరుపేద విద్యార్థులకు సెట్ అర్హత సాధించాలనే కల కలగానే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ ఉద్యోగ భర్తీ కోసం సన్నద్ధమవుతూ భారీగా ఖర్చు చేస్తున్న తరుణాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు కొంపల్లి నరేశ్, పెద్దమ్మ రమేశ్, శ్రీనునాయక్, కాటం శివ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు కృషి చేయాలి

బోయిగూడలో డెంగీ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంటమాలజిస్ట్ సిబ్బంది

బన్సీలాల్‌పేట్, మే 16 : రాబోయే వానాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా, డెంగీ లాంటి వ్యాధులు దరి చేరకుండా ప్రజలు జాగ్రత్త తీసుకోవాలని గాంధీ దవాఖాన పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి అన్నారు. జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో 'జాతీయ డెంగీ దినం' సందర్భంగా న్యూబోయిగూడలోని ఐడీహెచ్ కాలనీలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. అనంతరం మలేరియా సిబ్బందితో కలిసి ర్యాలీగా వెళ్ళి ప్రజలకు కరపత్రాలు పంచుతూ, అవగాహన కల్పించారు. ఎంటమాలజిస్ట్ హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, సూపర్‌వైజర్ రాజేందర్ రెడ్డి, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో..
బీఆర్ఎస్ గెలుపు ఖాయం

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఉద్యమకారుడు జంగిలి రాజు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు జంగిలి రాజు గురువారం పత్రి కా ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు మొత్తం బీఆర్ఎస్‌కే మళ్లిందని స్పష్టం చేశారు. మంచి మెజార్టీతో నివేదిత సాయన్న గెలుస్తారన్న నమ్మకం, విశ్వాసం తమకు ఉందన్నారు. కుల మతాలకు, పార్టీల కు అతీతంగా కంటోన్మెంట్ ఉప ఎన్నికలో నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితకు ఓట్లు వేశారని అన్నారు.

కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరిలో పూంబీ మాత 12వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు రంగా రవీందర్ గుప్తా హాజరై అమ్మ వారిని దర్శించుకొని ప్రార్థనలు చేశారు. – బొల్లారం

PUBLIC NOTICE

The general public is hereby informed that my client Mr. MOHD WASEEMULLAH KHAN S/o. Mr. Mohd Ibrahim Khan, aged about : 55 years, occ: Business, Resident of Flat No.8, 3 rd Floor, Vasavi Avenue, A.P.Text Book Colony, Karkhana, Secunderabad, was the owner of the residential Flat No.8, 3 rd Floor, Vasavi Avenue, A.P.Text Book Colony, Karkhana, Secunderabad, My client has sold the property to Mr. Parvez khan S/o Khaleel khan by virtue of sale Deed document No. 711/2024 dated 23/04/2024 and My client lost Original Link Sale Deed Bearing Document No. 1454/2001, dated: 25-08-2001 while travelling from Mudfort to Diamond Point on 07-12-2023 to that effect my client has lodge complaint along affidavit in the meeseva, Police Station Karkhana if any person or persons find the said document are hereby requested to return the same to my client or to the undersigned without misuse of the said document, if anybody misuse the said document my client will take necessary legal action and all the transactions based on the said lost document will become illegal and liable for prosecution. Any objections thereafter will be deemed to have been waived and shall not be entertained.

Sd/- **SULEMAN AHMED**
Advocate
2-3-134, Nallagutta, Ramgopalpet, Secunderabad-500003.
Mobile: 8885643256

బీఈ పరీక్షా ఫలితాల
రివాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 16: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని విభాగాల బీఈ (ఏఐసీటీఈ) పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఈ మొదటి, ఏడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను రెండు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 23లోగా టీఎస్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 25వరకు చెల్లించవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 25లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని ఐదేళ్ల ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఇంటిగ్రేటెడ్ కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ప్రొ. రాములు తెలిపారు. ఈ కోర్సు పదో సెమిస్టర్ రెగ్యులర్, ఇంప్రూవ్‌మెంట్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 29లోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలన్నారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 3లోగా చెల్లించవచ్చన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

కారును ఢీకొన్న బస్సు..

బేగంపేట్: బేగంపేట ఫ్లై ఓవర్‌పై వేగంగా దూసుకొచ్చిన బస్సు కారును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం ఉదయం 7 గంటల సమయంలో అమీర్‌పేట వైపు నుంచి బేగంపేట ఫ్లై ఓవర్ మీదుగా సికింద్రాబాద్ వైపు వెళ్తున్న కారును వెనుక నుంచి వచ్చిన ఓ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంతో ఫ్లై ఓవర్‌పై వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను తరలించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ప్రమాదంలో కారు దెబ్బతిన్నది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు కూడా స్వల్ప గాయాలయ్యాయి.